# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 04-12-2025 సమయం : సాయంకాలం 6గం. 10ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డ్ (ఎస్ఐపీబీ) 8.29 లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులకు ఈరోజు ఆమోదం తెలిపింది.
- ❖ పెట్టుబడుల ఆధారంగా రాష్ట్రాన్ని 3 ప్రాంతీయ జోన్లుగా ఏర్పాటు చేసి అభివృద్ధి చేస్తామని మంత్రి కందుల దుర్గేష్ తెలియజేశారు.
- ❖ ఐటీ రంగంలో లక్షా 22 వేల కోట్ల రూపాయల పెట్టుబడులకు అవగాహన ఒప్పందాలు జరిగాయని పరిశ్రమల శాఖా మంత్రి టీ జీ భరత్ వెల్లడించారు.
- ❖ రాష్ట్రంలోని గ్రామీణ ప్రజానీకానికి పాలనా పరంగా సత్వర సేవలందించాలన్నదే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ తెలిపారు.

====================

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన 13వ రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డ్ (ఎస్ఐపీబీ) సమావేశం అమరావతిలోని సచివాలయంలో ఈరోజు జరిగింది. ఈ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను ఉమ్మడి పాత్రికేయుల సమావేశంలో రాష్ట్ర మంత్రులు కందుల దుర్గేష్, టీ జీ భరత్ వెల్లడించారు. 13వ ఎస్ఐపీబీ సమావేశం ద్వారా 8.29 లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులకు ప్రభుత్వం ఆమోదం తెలిపిందని, తద్వారా 7 లక్షల 62 వేల 148 ప్రత్యక్ష ఉద్యోగాలు లభిస్తాయని మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు. ఎర్లీ బర్డ్ ప్రోత్సాహకాల కింద 6 కంపెనీలకు ఎస్ఐపీబీ ఆమోదం తెలిపిందని చెప్పారు. ఒక నిర్ణీత కాలపరిమితి నిర్దేశించుకొని కుదిరిన ఒప్పందాలు అమలయ్యేలా చర్యలు చేపట్టాలని ఈ సమావేశంలో ప్రభుత్వం తీర్మానించిందన్నారు. విశాఖపట్నంలో ఇటీవల జరిగిన CII సదస్సులో వచ్చిన పెట్టుబడులపై కూడా ఈ సందర్భంగా సమీక్ష జరిగిందన్నారు. వచ్చిన పెట్టుబడుల ఆధారంగా రాష్ట్రాన్ని 3 ప్రాంతీయ జోన్లుగా ఏర్పాటు చేసి అభివృద్ధి చేస్తామని అన్నారు. అందులో భాగంగా విశాఖపట్నం జోన్ లో 1.69 లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులు వచ్చాయని మంత్రి కందుల దుర్గేష్ వెల్లడిస్తూ...

(వాయిస్ 19 సెకన్లు)

ఇక పరిశ్రమల శాఖా మంత్రి టీ జీ భరత్ మాట్లాడుతూ.. వెయ్యి కోట్లకు పైగా పెట్టుబడులకు ఒక ప్రత్యేక అధికారిని ప్రభుత్వం నియమిస్తుందన్నారు. పెట్టుబడులకు సంబంధించి ఒక పోర్టల్ ఏర్పాటు చేసుకుని నిరంతరం పర్యవేక్షణ చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారని చెప్పారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ అమలు చేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. పర్యాటక రంగంలో 21 వేల కోట్లు, విద్యుత్ రంగంలో 4.54 లక్షల కోట్లు, ఐటీ రంగంలో 1.22 లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులకు ఎంవోయూలు జరిగాయని టీజీ భరత్ వివరిస్తూ...

(వాయిస్ 29 సెకన్లు)

====================

రాష్ట్రంలోని గ్రామీణ ప్రజానీకానికి పాలనా పరంగా సత్వర సేవలందించాలన్నదే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ తెలిపారు. ప్రభుత్వం అందించే సంక్షేమంతో పాటు, అభివృద్ధిని గ్రామీణ ప్రజలకు పారదర్శకంగా అందించేందుకు రాష్ట్ర వ్యాప్తంగా 77 డివిజనల్ డెవలప్మెంట్ (డీడీఓ) కార్యాలయాలను తిరుపతి నుంచి ఆయన ఈరోజు వర్చువల్ గా ప్రారంభించారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ.. పంచాయతీరాజ్ వ్యవస్థలో ప్రజా పాలనకు అనుగుణంగా సంస్కరణలు తెస్తున్నామన్నారు. ఏళ్ల తరబడి పంచాయతీరాజ్ వ్యవస్థలో పదోన్నతులకు నోచుకోని సిబ్బంది స్థాయిని పెంచి వారి సేవలను కూడా విస్తరిస్తున్నామని చెప్పారు. డీడీఓ కార్యాలయాల్లో ఆర్.డి.ఒ. స్థాయి అధికారిని నియమిస్తున్నామని, పంచాయతీరాజ్ శాఖలోని అన్ని విభాగాల డివిజనల్ అధికారులు ఈ కార్యాలయం నుంచే సేవలందిస్తారని స్పష్టం చేశారు. ప్రతి పంచాయతీ.. స్వతంత్రంగా వ్యవహరిస్తూ ప్రజల అవసరాలు తీరుస్తూ, స్థానిక సంస్థల దగ్గర సాధ్యం కాని పనులకు మాత్రమే ప్రభుత్వాలపై ఆధారపడేలా బలోపేతం చేయాలన్నదే ఈ సంస్కరణల లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి వెల్లడించారు.

====================

కృష్ణ తరంగాలు-2025 పేరిట కృష్ణా జిల్లాలోని అంతర్ కళాశాలల సాంస్కృతిక కార్యక్రమాల పోటీలను ఏర్పాటు చేయటం జరిగిందని రాష్ట్ర ఎక్సైజ్, గనుల శాఖా మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. రుద్రవరంలోని కృష్ణా విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి ఈరోజు మాట్లాడుతూ... విద్యార్థులలో దాగివున్న నైపుణ్య విలువలను మెరుగుపరుస్తూ.. సంస్కృతి సాంప్రదాయాలను ప్రతిబింబించే విధంగా గతంలో కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. అదే విధంగా ఇంటర్మీడియట్, డిగ్రీ విద్యార్థులలో సృజనాత్మక శక్తిని మేల్కొల్పే విధంగా కృష్ణ తరంగాలు కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. కృష్ణ తరంగాలు-2025 కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరైన పూర్వ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు మాట్లాడుతూ... సంస్కృతి సాంప్రదాయాలను, కళలను గౌరవిస్తూ రానున్న భావితరాలకు తెలియజేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. మాతృభాషను ప్రేమిస్తూ పరభాషను గౌరవిస్తూ పరిపాలనలో మాతృభాషతోనే సంప్రదింపులు జరిపే విధంగా ప్రభుత్వాలు కృషి చేయాలని తెలిపారు.

విరామం

====================

రాష్ట్ర వ్యాప్తంగా మెగా పేరెంట్స్, టీచర్స్ మీటింగ్ రేపు జరగనుంది. అందులో భాగంగా పార్వతీపురం మన్యం జిల్లా భామిని మండలం ఏపీ ఆదర్శ పాఠశాలలో జరగనున్న మెగా పేరెంట్స్, టీచర్స్ మీటింగ్ కు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ లు హాజరుకానున్నారు. ఈ నేపథ్యంలో జిల్లాకు విచ్చేసిన పాఠశాల విద్యా శాఖ ప్రధాన కార్యదర్శి కోన శశిధర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎన్. ప్రభాకర రెడ్డి తో కలిసి ఏర్పాట్లను ఈరోజు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సంయుక్త కలెక్టర్ సి. యశ్వంత్ కుమార్ రెడ్డి, పార్వతీపురం సబ్ కలెక్టర్ ఆర్. వైశాలి తదితరులు పాల్గొన్నారు.

====================

పల్నాడు జిల్లా అమరావతి మండలం యండ్రాయిలో రెండో విడత భూసమీకరణలో భాగంగా తీసుకుంటున్న 7 వేల ఎకరాల్లో అంతర్జాతీయ విమానాశ్రయం, స్పోర్ట్స్ సిటీ, స్మార్ట్ ఇండస్ట్రీస్ ఏర్పాటు చేస్తున్నామని పురపాలక, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి పి. నారాయణ స్పష్టం చేశారు. రెండో విడత భూసమీకరణ చేపడుతున్న ప్రాంత రైతులతో యండ్రాయిలో మంత్రి నారాయణ ఈరోజు సమావేశమయ్యారు. భూసమీకరణపై రైతుల అభిప్రాయాలను మంత్రి అడిగి తెలుసుకున్నారు. భూసమీకరణపై రాజధాని రైతుల విషయంలో అనుసరించిన విధానాన్నే ఇక్కడ కూడా అమలు చేస్తామని స్పష్టం చేశారు. ట్రంకు రోడ్లు, ప్రధాన రహదారులను వేగంగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. ఏడాదిలోపు స్పోర్ట్స్ సిటీ నిర్మాణం చేపట్టేలా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి నారాయణ తెలిపారు.

====================

తెలుగు పాటకు అమరత్వాన్ని ప్రసాదించిన ఘంటసాల వెంకటేశ్వరరావు జయంతి సందర్భంగా ఆ మహనీయుని స్మృతికి నివాళులు అర్పిస్తున్నానని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా ఒక పోస్ట్ చేశారు. ఘంటసాల కేవలం సినీ నేపథ్య గాయకుడు మాత్రమే కాదని భారత స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొని జైలుకు కూడా వెళ్లిన దేశభక్తుడని గుర్తు చేశారు.

====================

ఆంధ్రప్రదేశ్ మీదుగా దిగువ ట్రోపో ఆవరణంలో ఈశాన్య దిశగా గాలులు వీస్తున్నాయని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. వీటి ఫలితంగా రాష్ట్రంలో రేపు పలు చోట్ల తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ కేంద్రం అధికారి ఎల్. నారాయణ వెల్లడిస్తూ...

(వాయిస్ 26 సెకన్లు)

====================

యువత ఆలోచనలు, ప్రతిభ, సృజనాత్మకత రాష్ట్ర అభివృద్ధికి ఎంత ముఖ్యమో యువజన మహోత్సవాలు తెలియజేస్తాయని యువజన సేవల శాఖ కమిషనర్ ఎస్. భరణి అన్నారు. రాష్ట్ర యువజన సేవల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్న “యువ-2025” వివరాలను విజయవాడలోని స్థానిక ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలోని శాప్ ప్రధాన కార్యాలయంలో ఈరోజు ఆమె పాత్రికేయులకు వెల్లడించారు.

====================
====================